క్లుప్తంగా

నేడు భీమన్న బోనాలు



భీమన్న దేవుడిని ఊరేగిస్తున్న భక్తులు

దహెగాం: మండలంలోని బొప్పురం గ్రామం భీమన్న దేవాలయంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు బాగా కురువాలని పూజలు నిర్వహించారు. రెండో రోజు శనివారం మండల కేంద్రంలో దేవుడిని ఊరేగించారు.

నేడు బోనాల జాతర

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో బోనాల జాతర ఉత్సవాలను ఆదివారం నిర్వహించనున్నట్లు బోనాల కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ తెలిపారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, మధ్యాహ్నం ఒంటి గంటకు శివాజీ చౌరస్తా నుంచి మహంకాళి అమ్మవారి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతర ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ జంగుబాయి

తిర్యాణి: మండలంలోని గుడిపేట గ్రామపంచాయతీ పరిధిలోని కోర్లంక గ్రామంలో నూతన బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ల నిర్మాణం కోసం శనివారం స్థానిక సర్పంచ్ జంగుబాయి భూమిపూజ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టవర్ల నిర్మాణం పూర్తయితే కోర్లంకతో పాటు వివిధ గ్రామాలకు నెట్‌వర్క్ సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ జేటీవో రాజేశ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన వరుణయాగం



యాగం చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట్ శివాలయంలో భక్తిశ్రద్ధలతో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వరుణయాగం శనివారం ముగిసింది. ఆలయ అర్చకులు అంబేద సంతోష్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి హోమం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచిన సంవృద్ధిగా వర్షాలు కురవడం లేదని, విస్తారంగా వర్షాలు కురవాలని వరుణయాగం నిర్వహించినట్లు తెలిపారు.

'వైఎస్సార్ ఆశయాలు నెరవేరుస్తాం'



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం కృషి చేసిన దివంగత నేత, మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను తెలంగాణలో నెరవేర్చేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు బూక్యా గోవింద్‌నాయక్ పేర్కొన్నారు. వైఎస్సార్ 74వ జయంతి సందర్భంగా శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పించారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.100
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	80
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	120
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	80
క్యాబేజ	60

-ఆసిఫాబాద్‌అర్బన్

మొలకెత్తని విత్తనాలు..!



ఈయన పేరు గోలెం రాజన్న, చింతలమానెపల్లి శివారులో ఉన్న మూడు ఎకరాల్లో మిరప పంట సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది సైతం 40 ప్యాకెట్ల మిరప విత్తనాలు నాటాడు. ఎరువులు, కూలీలు మొత్తంగా సుమారు రూ.35వేల వరకు ఖర్చయ్యింది. సరిగా వర్షాలు కురవకపోవడంతో 80శాతం విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి నాటుతున్నాడు. దీంతో రూ. 25వేల వరకు అదనంగా ఖర్చవుతోందని రైతు వాపోతున్నాడు.

- నేలలోనే కుళ్లిపోయిన వైనం
- రైతులకు అదనపు వ్యయం
- ప్రతికూల వాతావరణమే కారణం



విత్తనాలు నాటినా మొలకెత్తని పత్తి చేను



కుళ్లిపోయిన పత్తి విత్తనాలు

చింతలమానెపల్లి: రైతులకు కాలం పరీక్ష పెడుతోంది. పంటలు పండించడానికి తెగుళ్లతో పోరాడే రైతులకు వాతావరణం కూడా సహకరించడం లేదు. సకాలంలో కురవని వర్షాలతో రైతులకు అదనపు కష్టాలు తప్పడం లేదు. పంటల దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులు సాగుపై ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో 23వేల ఎకరాల్లో సాగు భూమి ఉంది. 16వేల ఎకరాల్లో పత్తి, 3600 ఎకరాల్లో వరి పంట, 350ఎకరాలలో మిరప, మిగతా భూమిలో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో రైతులు ప్రధానంగా వర్షాలపై ఆధారపడి సాగు చేస్తుండగా కొద్ది మొత్తంలో బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు.

తగ్గిన వర్షపాతం..

గత ఏడాదితో పోల్చితే ఈఏడాది మండలంలో ఇప్పటి వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో 214 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం ఉండగా, గత ఏడాది జూన్‌లో 325 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. కాగా ఈఏడాది 162 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.

విత్తనాలు నాటిన రైతులు..

జూన్‌లో విత్తనాలు నాటుకోవడానికి చేలను సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలు ఆలస్యం కావడంతో ఆందోళనకు గురయ్యారు. వర్షాలు పడి భూమి చల్లబడిన అనంతరమే విత్తనాలు నాటుకోవాలన్న వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు నెలాఖరులో వర్షాలు పడ్డ తర్వాతే విత్తనాలు నాటుకున్నారు. వర్షాల కారణంగా గందరగోళానికి గురైన రైతులు మండలంలో 70శాతం మాత్రమే విత్తనాలు నాటారు. పత్తి, మిరప, సోయా రైతులు మాత్రమే పనులు పూర్తి చేసుకున్నారు. వరి సాగు చేయడానికి అనుకూలంగా వాతావరణం లేకపోవడంతో ఇప్పటి వరకు తక్కువ శాతంలో వరి సాగు చేశారు.

కుళ్లిపోయిన విత్తనాలు..

నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలతో రైతులు విత్తనాలు నాటుకున్నారు. అయితే ఆ తర్వాత వర్షాలు కురవకపోవడంతో భూమి వేడెక్కింది. వరుసగా వారం పాటు నమోదైన ఉష్ణోగ్రతలతో భూమిలోని విత్తనాలు వేడికి ఉబ్బిపోయి కుళ్లిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే విత్తనాలకు మొలకలు వచ్చే అవకాశం ఉండేదని పేర్కొంటున్నారు. మండలంలో ప్రధానంగా పత్తి, మిరప సాగు చేస్తున్న రైతులు నష్టపోయినట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

రైతులకు నష్టం..

విత్తనాలు కుళ్లిపోవడంతో సాగు భూమిలో మొలక శాతం తగ్గింది. పత్తి పంటకు ఎకరాకు సుమారు రూ. 5వేల వరకు నష్టం రాగా, మిరప పంటకు రూ. 8 వేల నుంచి రూ. 10వేల వరకు నష్టం వాటిల్లింది. కాగా తిరిగి సాగు చేసేందుకు మళ్లీ విత్తనాలు కొనుగోలు చేస్తూ అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

చెత్త కుప్పలు.. తిప్పలు



వాంకిడి మండల కేంద్రంలోని జనావాసాల్లో చెత్త కుప్ప

- గ్రామ పంచాయతీల్లో నిలిచిన పారిశుధ్య పనులు
- జీపీ కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే
- వ్యాధులు ప్రబలుతాయని ప్రజల ఆందోళన

వాంకిడి: గ్రామపంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ కార్మికులు మూడు రోజులుగా సమ్మెలో ఉండడంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, దుకాణ సమూదాయాల వద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త తొలగించేవారు లేక దుకాణదారులతో పాటు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని తొలగించాలని, ఆదాయం ఉన్న జీపీల్లో వేతనాలు పెంచాలని, కారోబార్లు, బిల్‌కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా గుర్తించాలని, రూ.10 లక్షల బీమా కల్పించాలనే తదితర డిమాండ్లతో పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టారు.

వ్యాధులు ప్రబలే ప్రమాదం..

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా కీలకంగా మారాయి. ప్రతీరోజు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతీవాడలో తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, రోడ్లను శుభ్రం చేయడం, విద్యుత్ పనులు, తాగునీటి బావులు, బోరింగుల వద్ద క్లోరినేషన్ పనులు, మురికి కాలువలు శుభ్రం చేయడం, అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ చేయడం, నీరు నిల్వ ఉండకుండా చూడడం వంటి ఎన్నో పనులు పంచాయతీ కార్మికులు చేపతుండేవారు. ప్రస్తుతం కార్మికులు విధులకు హాజరు కాకుండా సమ్మెలో ఉండటంతో పనులన్నీ నిలిచిపోయాయి. దీంతో మురికి నాలాలు చెత్తతో నిండిపోతున్నాయి. దీంతో ప్రాణాంతకమైన దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జీపీ కార్మికులు సమ్మె విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

జిల్లాకేంద్రంలో అస్తవ్యస్తం..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని ప్రధాన వీధుల్లో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. పట్టణంలోని శివకేశవ మందిర్, రావులవాడ, బ్రాహ్మణవాడ, తారకరామానగర్‌తో పాటు పలు కాలనీల్లో రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయింది.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

దహెగాం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మూడోరోజు శనివారం మండలంలోని గ్రామ పంచాయతీల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు చంద రమేశ్ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మెలో గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి రవీందర్, కోశాధికారి రాజ్‌కుమార్, కార్మికులు వెంకటి, రాజం, తదితరులు పాల్గొన్నారు.



దహెగాం: సమ్మెలో పాల్గొన్న కార్మికులు



కాగజ్‌నగర్‌రూరల్: మద్దతిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు శనివారం టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జిల్లా కార్యదర్శి మహిపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, చైన్‌రావు, మండల కమిటీ సభ్యులు మల్లేశ్, విజయ్, భీంరావు, గౌరయ్య, ధర్మయ్య, నారాయణ పాల్గొన్నారు.



కౌటాల: ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల సమ్మె



రెబ్బెనలో రాస్తారోకో చేస్తున్న పంచాయతీ కార్మికులు

కౌటాలలో..

కౌటాల: పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం కొనసాగింది. కార్మికులు జాడి మోరేశ్వర్, మోర్లె నాగేశ్, శంకర్, దేవాజీ, గులబ్‌రావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికలా ఆనంద్‌రావు అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించారు. మండల అధ్యక్షుడు రాథోడ్ రాందాస్, నాయకులు రాంమిల్ల నరేష్, తిరసుల్ల సంతోష్, పార్లస్వామి పుల్లయ్య, భుజంగ్‌రావు, వినేశ్, నగేశ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 51ని వెంటనే సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. జేఏసీ నాయకులు ఎన్. సుధాకర్, రమేశ్, శ్రీనివాస్, లక్ష్మి, వెంకటేష్, దేవాజీ, లక్ష్మి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల మద్దతు..

డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం సీపీఐ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, నాయకులు రహీం, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్పసభకు జిల్లా నాయకులు

రెబ్బెన: వరంగల్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పసభకు శనివారం మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీర ఆత్మారాం నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, వెంకట్ నాయక్, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, నాయకులు రాజునాయక్, ప్రేంనాయక్, నందకిషోర్‌లు పాల్గొన్నారు.



సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

వరంగల్ సభకు తరలిన బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం వరంగల్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభకు జిల్లా బీజేపీ నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు, అజ్మీర ఆత్మారాం నాయక్, కేసరి ఆంజనేయులు గౌడ్, గుల్బం చక్రపాణి, నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లతో పాటు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందులాల్, జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్, ప్రీతి, గురుకుల రాష్ట్ర కన్వీనర్ ఎల్లయ్య, జిల్లా నాయకులు ఊశన్న, ఉపేందర్, సుభాష్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నాయకులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నార్నూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని హరిభక్త పారాయణం శ్రీనారాయణ మహరాజ్, జ్వాలాముఖి సంస్థ పీఠాధిపతి శ్రీరామ సింగ్ మహరాజ్, సురేశ్ మహరాజ్ అన్నారు. శనివారం మండలంలోని మాన్కాపూర్ జిన్నింగ్ మిల్లులో శ్రీగజానంద్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవ పూజ నిర్వహించారు.

వనాల్లో మొక్కలను సంరక్షించాలి

కౌటాల: ప్రకృతి వనాల్లో మొక్కలను సంరక్షించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. శనివారం మండలంలోని నాగేపల్లి గ్రామంలో గల పల్లెప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిందన్నారు. పల్లెప్రకృతి వనాల్లో మొక్కలపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. ప్రకృతి వనాల్లో దట్టంగా మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి గ్రామానికి చెందిన బామినె గణేశ్ అనే యువకుడు అడవిపంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. లోనవెల్లి గ్రామసమీపంలోని పంట చేనుకు వెళ్లిన గణేశ్‌పై అడవిపంది దాడిచేసింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వైద్యచికిత్స కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.



గాయాలపాలైన గణేశ్

కంపెనీ షేర్ హోల్డర్స్‌ను పెంచుకోవాలి

కెరమెరి: భవిష్యత్తులో కంపెనీ షేర్ హోల్డర్స్‌ను పెంచుకోవాలని ఆదిలాబాద్ నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ అబ్దుల్ రౌఫ్ అన్నారు. శనివారం మండలంలోని సాకడా ఫార్మా ప్రొడ్యూసర్ కంపెనీని హైదరాబాద్ నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ అనంతగిరితో కలిసి సందర్శించారు. కంపెనీ చైర్మన్, బోర్డు సభ్యులతో సమావేశమై కంపెనీ పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కంపెనీ పనితీరు బాగుందని రాబోయే రోజుల్లో కంపెనీ పనితీరు మరింత మెరుగుపర్చుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ మోతీరాం, స్థానిక సర్పంచ్‌లతో కలిసి మొక్కలు నాటారు. చేతన ఆర్గానిక్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ దసండ్ల ప్రభాకర్, చైర్మన్ సిడం జంగు, సీఈవో రాజ్‌కుమార్, మహమ్మద్ ముజీబ్, అకౌంటెంట్ మెడీ దీప తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అబ్దుల్ రౌఫ్

పోడు భూముల పట్టాలు పంపిణీ

సిర్పూర్(టి): మండలంలోని పోడు భూముల లబ్ధిదారులకు శనివారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు స్థానిక రైతు వేదికలో పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 421 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలు అందజేశామన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఈర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, సర్పంచ్‌లు యాదగిరి బ్రహ్మయ్య, ప్రభాకర్, నాయకులు కాసం శ్రీనివాస్, కిజర్ హుస్సేన్, ఉమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.




పట్టాలు పంపిణీ చేస్తున్న కృష్ణారావు

సీఐకి సన్మానం

నార్నూర్: జైనూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మల్లేశ్‌ను ఆయన కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గిరిజనులు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ధర్మారావు, సర్పంచ్ భూపతి, నాయకులు నాగోరావు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వాలిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం



కెరమెరి: మండలంలోని సరిహద్దు గ్రామం ముకదంగూడలో ఇటీవల కురిసిన గాలి దుమారానికి విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒరిగింది. సగానికి పైగా వంగిన విద్యుత్ స్తంభానికి రెండు వైపులా ఆసరాగా కర్రలు అమర్చారు. మరోసారి భారీ వర్షం, ఈదురుగాలులు వీస్తే స్తంభం పూర్తిగా నేలవాలే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.